క్లుప్తంగా

వైభవంగా శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు



పెనమలూరు: తాడిగడప ఎస్‌టీబీఎల్‌కాలనీలో శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మూడవ రోజు శనివారం స్వామివారికి దివ్య తిరు విశేష కల్యాణ మహోత్సవం చేశారు. ఉదయం సహస్ర కలశాభిషేకం చేశారు. 1008 కలశాలతో శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామివారికి అభిషేకం చేశారు. వేదపండితుల మంత్రాలతో సన్నాయి మేళాలతో ఘనంగా పూజలు చేశారు. గోవింద నామ సంకీర్తనతో గ్రామంలో భక్తి పారవస్యం ఏర్పడింది. అగ్ని రాధన, కుంభారాధన, నిత్య హోమం చేశారు. ఆదివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు సీతారాణి, భారతిప్రసాద్, సుబ్బయ్యశర్మ, రామకృష్ణ, శేషఫణి, విశ్వనాథ్, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు కోరారు.

58 మందికి వైద్య సేవలు



పెనమలూరు: పోరంకి గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ స్థానికులకు వైద్య సేవలు అందించారు. గ్రామంలో 58 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్, గుండె, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు రోగులకు మందులు పంపిణీ చేశారు. వైద్యురాలు అనూష వైద్య సేవలు అందించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



పెనమలూరు: పోరంకి గ్రామంలో వాసవి క్లబ్ ప్రతినిధులు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు రాచూరి ఆంజనేయులు మాట్లాడుతూ పోరంకి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గత 64 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వాసవి క్లబ్ ప్రతినిధులు ప్రయాణికులకు అండగా నిలిచారని తెలిపారు. వాసవి క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు వెంకటమస్తాన్, ట్రెజరర్ శైలజ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కమ్మ సేవా సమితికి విరాళం



పెనమలూరు: కమ్మసేవా సమితికి గోసాలకు చెందిన దంపతులు కోనేరు నాగేశ్వరరావు, కోనేరు విజయలక్ష్మి విరాళం అందచేశారు. గోసాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో కమ్మసేవాసమితి ట్రెజరర్ కోనేరు వెంకటరామారావుకు రూ.50,116 అందచేశారు. కమ్మసేవా సమితి ఆధ్వర్యంలో పేద బాలికలకు నిర్వహిస్తున్న హాస్టల్ ఖర్చులు, పేద విద్యార్థుల చదువుకు సాయం అందిస్తామన్నారు.

వ్యాయామంతో మానసిక ఉల్లాసం



గన్నవరం రూరల్: వ్యాయామంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో ఎక్సర్‌సైజులు చేయించారు. పుస్తకాలు చదివించారు. పాఠకులు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కూరగాయల సాగు భళా

- వేసవిలో కూరగాయల సాగు వైపు రైతుల ఆసక్తి
- జిల్లాలో 520 ఎకరాల్లో సాగు
- ప్రోత్సాహకాలు అందిస్తున్న ఉద్యానశాఖ



ఈడుపుగల్లులో సాగులో ఉన్న బీర తోట

కంకిపాడు: వేసవి అనగానే ఖాళీ పంట పొలాలు దర్శనమిస్తాయి. తొలకరి వర్షం కురిసే వరకూ పైపాటు పనులు చేసుకుంటూ సాగు సన్నాహాల్లో రైతులు ఉండే పరిస్థితి. అయితే కొందరు రైతులు మెట్ట పొలాల్లో కూరగాయ పంటలను సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. కూరగాయ పంటల సాగుకు ఉద్యానశాఖ అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తూ అండగా నిలుస్తోంది.

కృష్ణా జిల్లాలో ఈ సీజన్‌లో 520 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల పంటలను రైతులు సాగు చేశారు. జిల్లాలో ప్రధానంగా పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, మోపిదేవి, బాపులపాడు, చల్లపల్లి, అవనిగడ్డ, ఉయ్యూరు మండలాల్లో కూరగాయల సాగు ఎక్కువగా జరుగుతోంది. ప్రధానంగా బెండ, దొండ, సొర, పొట్ల, బీర, దోస, ఆకు కూరలు, ఇతర కూరగాయ పంటలను సాగుకు ఎంపిక చేసుకుంటున్నారు. ఈ వేసవిలోనూ ఆయా మండలాల్లో కూరగాయల సాగు చేపట్టారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో పంట చేతికి రావటంతో రైతులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. వేసవిలో పంట పొలాలను ఖాళీగా ఉంచకుండా అదనపు ఆదాయం లక్ష్యంగా ఈ సీజన్‌ను సద్వినియోగం చేసుకునేలా కూరగాయల సాగు చేపడుతున్నారు.

ఉద్యాన శాఖ ప్రోత్సాహం.....

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేలా ఉద్యానశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కౌలు ఒప్పందాలు జరిగే అవకాశం ఉండటంతో వరి, చెరకు పంటలకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలను సాగు చేసుకోవాలని ఊరూరా అవగాహనా కార్యక్రమాలను చేపట్టింది. ప్రత్యేకించి వేసవిలో కూరగాయ పంటలను సాగు చేసుకునేలా సూచనలు ఇస్తుంది. ఏటా జిల్లాలో 500 ఎకరాలకు తగ్గకుండా కూరగాయ పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా సాగు చేసే తీగ జాతి పంటలకు శాశ్వత పందిళ్లు నిర్మించుకునేందుకు రైతులకు రూ.లక్ష రాయితీగా అందిస్తుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా రాయితీని రైతులకు అమలు చేస్తుంది. అంతే కాకుండా నాణ్యమైన విత్తనాలను, గుర్తించిన నర్సరీలు ద్వారా సేకరించుకునేలా రైతులకు ఉద్యానశాఖ సూచనలు అందిస్తుంది. రాయితీలను పొందేందుకు రైతుల ఉత్పత్తి దారుల సంఘాలుగా ఏర్పడి ఉద్యాన పంటల రాయితీలను పొందేలా ఆ శాఖ క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తుంది. దీంతో రైతులు ఆ దిశగా సాగు పనుల్లో నిమగ్నమవ్వటం గమనార్హం.

ఉద్యానమే ప్రత్యామ్నాయం



ఉద్యాన పంటలే ప్రత్యామ్నాయం. వేసవిలో కూరగాయలను సాగు చేయటం ద్వారా సాధారణంగా కూరగాయలు అందుబాటులో ఉండని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ క్రమంలో కూరగాయలు సాగు చేసే రైతులకు మంచి దిగుబడులు, మంచి ధర లభిస్తుంది. సాగుకు అవసరమైన రాయితీలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకుంటున్నాం.

– జె.జ్యోతి, జిల్లా ఉద్యాన అధికారి, కృష్ణాజిల్లా

రైతులను చైతన్యపరుస్తున్నాం



సీజన్‌కు అనుగుణంగా అనువైన ఉద్యాన పంటలను సాగు చేసుకునేలా రైతులను చైతన్యపరుస్తున్నాం. ప్రభుత్వం నుంచి అందుబాటులో ఉన్న పథకాలను రైతులకు చేరువ చేస్తున్నాం. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేలా, జిల్లాలో సాగు విస్తీర్ణం పెంపుదల లక్ష్యంగా పనిచేస్తున్నాం. రాయితీలు సద్వినియోగం చేసుకుని సాగులో లాభాలను ఆర్జించాలి.

– జోసఫ్ చందు, ఉద్యాన అధికారి, కంకిపాడు

బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలు తిలకిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని బాపు మ్యూజియం(విక్టోరియా)లో భావనా ఋషి చేనేత హస్త కళా కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో చేనేత హస్త కళా ప్రదర్శన ప్రారంభమైంది. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేనేత ప్రదర్శనను ప్రారంభించారు. ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. పలు డిజైన్ల చేనేత ఉత్పత్తులు, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉత్పత్తి అయిన చేనేత వస్త్రాలను ఒకేచోట విక్రయించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. ఉత్పత్తిదారులే నేరుగా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని, నెల రోజులపాటు సాగే ఈ ప్రదర్శనను ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు బట్టు సురేష్, అందే సింహాద్రి మాట్లాడుతూ వచ్చే నెల 25వరకు ప్రదర్శన అమ్మకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆత్మకూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

గన్నవరం: స్థానిక విద్యానగర్‌లో వీకేఆర్ కళాశాల 1976–79 బ్యాచ్ డిగ్రీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. కళాశాలలో 44 ఏళ్ల క్రితం బీఏ పూర్తిచేసిన విద్యార్థులు శనివారం ఒకే వేదికపై కలుసుకుని సందడి చేశారు. కళాశాల జ్ఞాపకాలను, అధ్యాపకులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం అప్పటి అధ్యాపకులైన గన్నె వెంకట్రావు, గద్దం కోటేశ్వరరావు, కేసీ. గాంధీబాబు, కొడాలి రాజేశ్వరి, డీవీ. సుబ్బారావును సత్కారించారు. పూర్వ విద్యార్థి జీపీజే. విక్టర్‌బాబు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో..

జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమాన్‌జంక్షన్(గన్నవరం): మండలంలోని రామన్నగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 1997–98 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. సుమారు 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. విద్య బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించడంతో పాటు ఆటపాటలతో సందడి చేశారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

నిధులు దుర్వినియోగంపై విచారణ

పెనమలూరు: గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం పై లోకాయుక్త విచారణకు ఆదేశించారు. రూ.47 లక్షల నిధులు బిల్లు కలెక్టర్ దుర్వినియోగం చేయటంపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి కృష్ణా జిల్లా డీపీవోకు ఆదేశిస్తూ జూన్ 26వ తేదీ నాటికి విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కంకిపాడు: రోడ్డు ప్రమాదంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన పల్ల సూరిబాబు ఈనెల 14వ తేదీన రోడ్డు దాటుతుండగా కోలవెన్ను నుంచి పునాదిపాడు వైపు వెళ్తున్న బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో సూరిబాబు గాయపడ్డాడు. క్షతగాత్రుడు విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆస్తి వివాదంలో వ్యక్తిపై దాడి

గన్నవరం: ఆస్తి వివాదం విషయమై ఓ వ్యక్తిపై కుటుంబ సభ్యులు దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలోని గొల్లనపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అన్వర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో నెల రోజులుగా కర్నూలులో ఉన్న మూడు ఎకరాల పొలం విషయమై అన్వర్‌కు అతని భార్య, బామ్మర్ది మధ్య వివాదం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఉదయం అన్వర్ కంట్లో కారం కొట్టి బామ్మర్ది బాజీ ఇతర కుటుంబ సభ్యులు కర్రలు, రాడ్లతో దాడిచేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన అన్వర్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగ ప్రథమ చికిత్స అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

సమాధుల తోట అభివృద్ధికి నిధులు

పెనమలూరు: గ్రామంలో క్రైస్తవుల సమాధుల తోటకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం పెనమలూరు క్రిస్టియన్ అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. పెనమలూరు గ్రామంలో సర్పంచ్ లింగాల భాస్కరరావు చొరవతో శ్మశానవాటికకు స్థలం కేటాయించారన్నారు. దీని అభివృద్ధికి ఎమ్మెల్యే పార్థసారథి మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు కేటాయించటంతో ప్రహరీ నిర్మాణం జరిగిందన్నారు. స్థానిక పాస్టర్లు కూడా శ్మశానం అభివృద్ధికి కృషి చేశారని సంఘ సభ్యులు పరంగి డానియల్, కలపర్తి నిరీక్షణరావు, యాదాసు రతన్‌బాబు, పీటర్, పాస్టర్లు పాల్గొన్నారు.


రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఉంగుటూరు: వ్యవసాయ కార్యాలయంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ హరీష్ కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందజేసేందుకు ఆర్‌బీకేల్లో ఉన్నాయన్నారు. పిల్లి పెసర కేజీ రూ.48, జీలుగ కేజీ.రూ.39, జనుము కేజీ రూ.42 సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారని చెప్పారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో ఆర్‌బీకేల్లో సంప్రదించాలని సూచించారు.

ఆన్‌లైన్ మస్టరు విధానాన్ని రద్దు చేయాలి

కంకిపాడు: ఆన్‌లైన్ మస్టరు విధానాన్ని రద్దు చేయాలని కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రంగారావు డిమాండ్ చేశారు. మండలంలోని మంతెన, తెన్నేరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం రక్షణ యాత్రలు శనివారం నిర్వహించారు. కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రంగారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సర్వర్‌లు పనిచేయక మస్టరు పడక కూలీలు వేతనాన్ని నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

'కొలుకలూరి కోయిలమ్మ రావూరి బుల్లెమ్మ' గ్రంథావిష్కణ



గ్రంథావిష్కరణ సభలో అన్నవరపు రామస్వామి, జంధ్యాల శంకర్, సుధాకర్ తదితరులు

విజయవాడ కల్చరల్: శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తనా అకాడమీ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సంగీత విద్వాంసులు గరిమెళ్ళ బాల కృష్ణ ప్రసాద్, బుల్లెమ్మ నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనా స్రవంతి, పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనల ప్రచారం చేస్తున్న గాయని బుల్లెమ్మ జీవిత విశేషాలను తెలియజేస్తూ సుభద్ర రచించిన కొలకలూరి కోయిలమ్మ, రావూరి బుల్లెమ్మ గ్రంథాన్ని వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి ఆవిష్కరించారు. సంగీత విద్వాంసురాలు మాధవపెద్ది మీనాక్షి, మోదుమూడి సుధాకర్, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ ప్రసంగించారు. గాయని బుల్లెమ్మను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. బాలకృష్ణప్రసాద్, బుల్లెమ్మ అన్నమయ్య సంకీర్తనలను మధురంగా గానం చేశారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్ల సత్కారంలో పాల్గొన్న ఎంపీపీ రవి, గౌసాని, సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న

గన్నవరం రూరల్: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ అనగాని రవి కొనియాడారు. మండలంలోని మాదలవారిగూడెం గ్రామ సచివాలయం వద్ద శనివారం 12 మంది వలంటీర్లను సర్పంచ్ బుద్ధాల లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన జరిగిన సభలో ఆయన సత్కరించారు. సేవా రత్న సాధించిన బాయన స్వరూపను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్లు, సచివాలయం వ్యవస్థ నిర్మాణంతో గడప వద్దకే ప్రభుత్వ పాలన తెచ్చిందన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబు, సచివాలయం కార్యదర్శి కేవీ రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు రాజేష్, వెంకటరత్నం పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



కంకిపాడు గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



తెన్నేరు గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కంకిపాడు: పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసం సాధ్యమని కంకిపాడు గ్రంథాలయాధికారి సిహెచ్ రామకృష్ణ అన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా కంకిపాడు శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక పఠనం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నిక్షిప్తమైన విజ్ఞానాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న దాతలు

కంకిపాడు: ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని వక్తలు సూచించారు. మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన పద్మశాలి విద్యార్థులు నలుగురికి ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున దాత పి.శేషగిరిరావు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పడవల మధుసూదన్‌రావు, ఉప్పలూరు ఉప సర్పంచ్ బొడ్డు నాగమల్లేశ్వరరావు, భావనారుషి దేవస్థాన కమిటీ సభ్యులు గద్దె శ్రీధర్, వెంగల రామకృష్ణ శంకర్, పెద్ది నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జొన్నలగడ్డకు ఎన్టీఆర్ స్మారక పురస్కార ప్రదానం



జొన్నలగడ్డ జగన్మోహనరావుకు ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్ర మహాసభ బెంగళూరు, భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు, రంగస్థల నటుడు జొన్నలగడ్డకు ఎన్టీఆర్ పురస్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాలను దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని ప్రభుత్వం కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తునట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరుతో జిల్లా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. న్యాయవాది వేముల హజరత్తయ్య మాట్లాడుతూ తెలుగు చిత్ర సీమలోఎన్టీఆర్‌యుగం స్వర్ణయుగంగా అభివర్ణించారు.రంగస్థల నటుడు పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా రంగస్థల నటుడు జొన్నలగడ్డ జగన్మోహనరావుకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. బత్తుల కీర్తన కూచిపూడి నృత్యాలు, వి.ఏడుకొండలు భక్తాంజనేయ ఏకపాత్రాభినయం, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ ఆధ్వర్యంలో శ్రీకృష్ణరాయబారం పద్యనాటకంలోని యుద్ధ సన్నివేశాన్ని ప్రదర్శించారు. కళాకారుడు పీవీఎల్ నృసింహం, భాస్కరశర్మ పాల్గొన్నారు.

కులగణన కమిటీ ఏర్పాటుపై హర్షం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీలో కులగణన చేపడతామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరుగురు అధికారులతో అధ్యయన కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంపై బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో శనివారం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, వడ్డీల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదు గాయత్రి సంతోషి, బట్రాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి, నాగవంశి నాయకులు బొడ్డు అప్పలనాయుడు, అత్తులూరి రాజేంద్రప్రసాద్, ధనాలకోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మాట ఇచ్చాడంటే చేస్తాడంతే' అన్న నానుడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచే మొదలైందని ఏపీ కుమ్మరి/శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం అన్నారు. బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన చాంబర్‌లో శనివారం సాయంత్రం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గుమ్మడాల బసవేశ్వరరావు, ఓబులుశెట్టి మోహన్‌బాబు, రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.